


# అంతా శూన్యం

మద్రాసు నగరంలో విశాలమైన భవనం. వసారాలో కుర్చీలో కూర్చుని కాఫీ సేవిస్తూ వార్తా పత్రిక పఠిస్తున్న ధనస్వామి శేషగిరిరావుకు కాఫీ చేదుగా తోచింది. మనసులో ఆరాటం బయలుదేరింది. ఎందుకీ సంఘటన జరగాలో శేషగిరిరావుకు అర్థం కాలేదు. అంతలో అతని ఆలోచనకు అంతరాయం కలిగింది.

"నాన్నా, పత్రికలో వార్త చూచావా" చిన్న కొడుకు రమణమూర్తి ప్రశ్నించాడు.

శేషగిరిరావు మూలిగాడు. చూచాడు. చూడకపోవడం ఏమి? వార్తలు చదవడానికే కదా నాలుగు రూపాయలు ఖర్చుపెట్టి పత్రిక కొంటున్నాడు! లేకపోతే పత్రిక ఎందుకు? శేషగిరిరావు చదవడానికి అలవాటుపడి కొంటూఉన్న వార్తా పత్రిక అన్ని వార్తలూ ప్రచురిస్తుంది. సామాన్యంగా తతిమ్మా పత్రికలు ఇచ్చే వార్తలకన్న ఎక్కువ వార్తలు అందిస్తుంది. అందుకనే కొంచెం ఖర్చు ఎక్కువ అయినా ఈ పత్రికే కొంటున్నారు. ఖర్చుపెట్టే ప్రతి పైసకు-ప్రతి నయాపైసకు-తగిన ప్రతిఫలం లభించాలనేది అతని జీవితానికి పట్టుగొమ్మ అయిన తత్వం. ఈ పద్ధతి మంచిదే. కాని ఇప్పుడు అదికూడా బాధాకరంగానే పరిణమించింది. చిన్నవాడి ప్రశ్నకు సమాధానం చెప్పలేక మూలిగాడు శేషగిరిరావు.

ఈ పత్రిక కొనకుండా అణా కాని బాపతు మరొక పత్రిక ఏమైనా కొంటే బాగా ఉండేదేమో? ఇతర పత్రికలు ఏమైనా అయితే అంత శ్రద్ధ తీసుకొని ఈ వార్త కూడా ప్రచురించి ఉండకపోను. ఆనాడు దాన్ని ప్రొద్దుటే చూడవలసిన అవస్థా తప్పిఉండేది. ఇప్పుడు దాన్ని గురించి ఆలోచించే బాధా ఉండేదికాదు. ఒక కుర్ర వెధవ వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పవలసిన అవసరమూ ఉండేదికాదు. ప్రొద్దుటే వ్యవహారాలు గురించి ఆలోచించడం కాని, సమస్యలు పట్టుకొని బాధపడడం కాని శేషగిరిరావుకు ఇష్టం లేదు. భోజనంవేళవరకు ఏ విషయమూ శేషగిరిరావు దగ్గర కదపడానికి వీలులేదు. ఆ ఇంట్లో ఆయన శాసనం అది.

ప్రొద్దుట పత్రిక చూడగానే కనుపించింది ఆ వార్త. మొదట మద్రాసు నగరంలో వార్తలు చదివి, వాణిజ్య ధరలు పరిశీలించి, తరువాత క్రమంగా రాష్ట్రీయ జాతీయ ప్రపంచ వార్తలు చదవడం ఆయనకు అలవాటు. అదికూడా పొరపాటు కావచ్చు. మద్రాసు వార్తలు ఆఖర్ని చదివితే మంచిది. అప్పుడు పత్రికా పఠనం పూర్తి అయ్యే దశలో కాని ఇలాంటి వార్తలు కంటపడడానికి అవకాశం ఉండదు. మానసికంగా మామూలు స్థితికి రావడానికి కొంతలో కొంత అయినా వ్యవధి ఉంటుంది. ఇలాంటి ఆఘాతాలు తట్టుకొన డానికి వోపిక ఉంటుంది. ఈ క్రమం మార్పు చేయడం తీరిక ఉన్నప్పుడు ఆలోచించవలసిన విషయమే.

మరొకటి. ఆ మాత్రం ఆలస్యంగా వార్తలు శేషగిరి రావు కంట పడితే మాత్రం ఏమి లాభం? అంతకుముందే— శేషగిరిరావు నిద్ర లేచేటప్పటికే — ఇంటిల్లిపాదీ పత్రిక చూడడం అయిపోతుంది. భార్య లలితమ్మకు తప్ప తతిమ్మా అందరికీ ఇంగ్లీషు వచ్చు. ఎంతో ఖర్చుపెట్టి పై చదువులు కూడా చెప్పించిన తరువాత ఇంగ్లీషు తెలియకపోతే ఆశ్చర్యం కాని తెలియడంలో ఆశ్చర్యం ఏముంది? ఇద్దరు కొడుకులు, కుమార్తె ఆసాంతం పఠిస్తారు. చదవడంతో సరిపెడతారా? వార్తల్లో వాళ్ళకు ముఖ్యమని తోచినవి పట్టుకొని చర్చిస్తారు. మరొక బాధ. "ఈ వార్త చూచావా, ఆ వార్త చదివావా" అని ప్రశ్నిస్తారు. లేదంటే చదవమంటారు. ఎందుకు చదవాలో చెప్తారు. చదవకపోతే పెదవి విరుస్తారు. ఏమిటో పోగొట్టు కొన్న వారిలా ముఖాలు వేలవేస్తారు.

పిల్లలకు చదువు చెప్పించకపోతే బాగా ఉండేదేమో? అదీ లాభం లేదు. చదువు లేకపోతే ఉద్యోగమో సద్యోగమో చేసుకొనే అర్హత ఉండదు. అప్పుడు శేషగిరిరావు ఆర్జించినదే అందరికీ ఆధారం అవుతుంది. ఆదాయం తక్కువ. ఖర్చు ఎక్కువ. అందరూ సంపాదిస్తే—కొంచెం కానీ, గొప్ప కానీ—ఆదాయం అధికంగా ఉంటుంది. ఖర్చు తక్కువ కాక పోయినా కొంత మిగులుతుంది.

ఖర్చు అన్నివిధాలా తగ్గించడానికి శేషగిరిరావు నిత్యమూ ప్రయత్నిస్తున్నమాట యథార్థం. కొంత అయినా మిగుల్చుకోకపోతే కష్టం. ఏమి వచ్చినా ఆదుకొనేవారు ఉండరు. ప్రాజ్ఞుడైనవాడు ఈవేళ సంగతే కాదు రేపటి సంగతి కూడా చూస్తాడు. ఈవేళ ఏదో కొంత ఉన్నదంటే శేషగిరిరావు మొదటినుంచీ జాగ్రత్తపడుతూ ఉండడమే దానికి కారణం. పిల్లలకు చదువు చెప్పించడమూ మంచిదే అయింది. అమ్మాయి సుశీలకు పెండ్లి చేశాడు. శేషగిరిరావు కట్నం బాగానే ఇచ్చాడు. అల్లుడు జిల్లాకలెక్టరుగా ఉన్నాడు. పెద్ద అబ్బాయికి హైకోర్టు జడ్జిగారు పిల్లనిచ్చి పెండ్లి చేస్తానంటు న్నారు. పెద్దవాడు నరసింహారావు ఐ. ఏ. ఎస్. పరీక్షలో నెగ్గి ట్రెయినింగుకు వెళ్ళనున్నాడు.

ఈ వేళ ఈ ఇబ్బంది రాకుండా చేయడానికి మొదటి నుంచీ పత్రిక కొనకుండా ఉండడం ఒక మార్గం. దానివల్ల కొంత ప్రయోజనం ఉంది. నష్టం జాస్తీ. వాణిజ్య ధరలు పరిశీలించడం శేషగిరిరావు వ్యాపారానికి అవసరం. ధరలు

చూడకపోవడం వ్యాపారానికి దెబ్బ. ధరలకోరకు పత్రిక అవసరం. పత్రిక కొంటే ఇలాంటి ఇబ్బందులు తప్పవు. వాణిజ్య ధరలు మాత్రమే ప్రచురించే పత్రికలు ఉంటే ఎలా ఉండేదో? అదీ లాభం లేదు. రాజకీయ వ్యవహారాల పరిశీలన కూడా ముఖ్యం. రాజకీయాలనుబట్టి ప్రభుత్వాలు నడుస్తూ ఉంటాయి. ప్రభుత్వవిధానాలనుబట్టిధరలుమారుతూఉంటాయి. ఈ విధంగా అన్నింటిలోను ఒక లాభము, ఒక నష్టము ఉంటున్నాయి.

లాభం మాత్రమే ఉండి నష్టం లేకుండా ఉంటే ఎంత బాగా ఉండేది! అదే రామరాజ్యం అంటే. అది ఇప్పట్లో వచ్చే అవకాశం లేదు. శేషగిరిరావు నిట్టూర్పు విడిచాడు. తిరిగి ఆయనఆలోచనకు అంతరాయం కలిగింది.

"అమ్మకు దుఃఖం ఆగింది కాదు. వెంటనే......" అంటూ చిన్నవాడు ఏదో చెప్పబోయాడు.

కోపంతో చిన్నవాడి వంక చూచి, "మాట్లాడకు. ఉండు. ఆలోచించనియ్యి" అన్నాడు శేషగిరిరావు.

భార్య కంగారు పడుతుంది. ఆ సంగతి శేషగిరిరావుకు తెలుసు.

కాని, వెంటనే అంటే ఏమిటి అర్థం? అసలు ఇలాంటి ప్రశ్న వస్తుందని శేషగిరిరావుకు తెలుసు. ఇందాకటినుంచీ భయపడుతూనే ఉన్నాడు.

మగవాళ్ళు—ఇంటి యజమాని అయినవాళ్ళు— ఏదో చేస్తారు. చేయకుండా ఎలా ఉంటారు? ఆలోచించి

ఏమి చేయాలో నిర్ణయించి అలా చేస్తారు. ఆడవాళ్లు అడిగితే చేస్తారా? అలాంటప్పుడు అడగడం ఎందుకు? ఆ విచక్షణ స్త్రీలకు లేదు. అడుగుతారు. అడగకుండా ఉండలేరు.

చేయడం సంగతి ఆలోచిస్తే ఒక ప్రశ్న వస్తుంది. ఇప్పుడు శేషగిరిరావు కల్పించుకొని, ఏదో చేయవలసిన అవసరం ఏముంది? ఇలా జరగాలని ఆయన కోరుకోనలేదు. అది జరగడానికి కారకుడు అంతకన్నా కాడు. అలాంటప్పుడు శేషగిరిరావు ఇప్పుడు ఏమీ చేయనక్కరలేదు. ఏదో చేయమని ఇతరులు ఆయనను నిర్బంధించవలసిన పని కూడా లేదు. శేషగిరిరావుకు చిరాకుగా ఉంది.

"ఏమిటీ ఆలోచన, నాన్నా? మనకన్న దగ్గరవాళ్ళు ఎవరున్నారు? అందుకని అమ్మ......"

ఈసారి కోపం వచ్చింది శేషగిరిరావుకు. చిన్నవాడిని కొంచెంసేపు నోరు మూయమన్నాడు. చిన్నవాడు నిర్ఘాంతపోయి గోడకు చేరబడి ఉండిపోయాడు.

నిజమే. శేషగిరిరావు కన్న దగ్గరవాళ్లు లేరు. ఆయనకు కాకపోతే భార్య లలితమ్మకు దగ్గర. అందుచేత ఆయనకు దగ్గర. ఈవేళ ఈ విపత్తు ఆయనమీద విరుచుకొని పడడానికి కూడా అదే కారణం.

దగ్గర కాకపోతే ఎంత బాగా ఉండేది! ఇప్పుడు దాన్ని గురించి ఆలోచించడంవల్ల లాభం లేదు. జరగవలసినదంతా

జరిగిపోయింది. కాదంటేపోదు. ఆ మాటకు వస్తే ఇలా జరుగుతుందని ఎవరు అనుకొన్నారు? బావ రామం......

*          *          *

లలితమ్మ అన్న—రామం—బావ రామం మంచివాడే ఒక రకంగా. మరొక విధంగా ఆలోచిస్తే రామం బావ కాకుండా ఉంటే బాగుండే దనిపిస్తుంది.

బావ రామం మంచివాడే కాని బీదవాడు. బావలో మంచితనం ఉంది. బావ జేబులో డబ్బు లేదు. జాలి ఉంది. జాగ్రత్త లేదు. మంచితనము, జాలి ఉండవలసినవే. కాని డబ్బు, జాగ్రత్త ముఖ్యం.

బావ మంచితనం శేషగిరిరావు అనుభవంలోకి వచ్చిన సత్యం. దాన్ని కాదనడు శేషగిరిరావు. ఆయన దేన్నీ పూరకనే కాదనే మనిషి కాదు. వాస్తవాన్ని చూడకుండా పోడు. దానికి ఆయన భార్యా బిడ్డల విషయం తార్కాణం. డబ్బు, జాగ్రత్త అని ఎంత బోధించినా అవి రెండూ వాళ్ళకు అబ్బలేదు. ఎంత చెడ్డా భార్యా బిడ్డలు. అది వేరే విషయం.

బావ రామంలో మంచితనం లేకపోతే శేషగిరిరావు మద్రాసు వచ్చి ఉండేవాడు కాడు. ఈ ఐశ్వర్యమూ పట్టి ఉండేది కాదని మనసులో ఒకమూల ఎక్కడో పీకుతూ ఉంది. కాని, అదేమన్నమాట? ఈ ఊరు వస్తే కాదు ఈ ఐశ్వర్యం, ఈ భోగం...శక్తిసామర్థ్యాలు ఉండబట్టి లభించినవి.

అయితే ఏం? రామం మూలంగా శేషగిరిరావు మద్రాసు వచ్చాడు. అప్పుడు బావ రామం మద్రాసులో

ఉండేవాడు. ఏదో కంపెనీలో గుమాస్తా. ఇప్పటికీ గుమాస్తాయే. ఎవరి అదృష్టం వారిది.

శేషగిరిరావు పట్టం సంపాదించుకొన్నాడు. ఏమైనా ఆంధ్ర దేశంలో ఆ తెలుగు బిడ్డకు ప్లీడరు గుమాస్తాగిరికూడా లభ్యం కాలేదు. అన్ని ప్రయత్నాలతోపాటు మద్రాసులో కూడా ప్రయత్నిద్దా మనుకొన్నాడు. బావ రామానికి ఒక ఉత్తరం వ్రాశాడు. ఏమైనా అవకాశం ఉంటే తెలియపరచ మని కోరాడు. అనుభవం బట్టి సమాధానం వస్తుందని ఆశించ లేదు. ఇలాంటిది బావ రామం వద్దనుంచి జవాబు వచ్చింది. ఆశించిన దానికన్న అధికమైన ఆశ చూపింది.

'ఉద్యోగంకోసం ప్రయత్నిద్దాం. అందాకా కలసి ఉందాం. మరేమీ పరవాలేదు. బ్రతకలేకపోతామా ? అనుమానించక ఆలసించక వెంటనే బయలుదేరిరా' అని వ్రాశాడు బావ రామం. ఆతని ఉత్తరం చూస్తే ఎన్నడూ లేనిది మనుష్యులమీద ప్రేమ పుట్టుకు వచ్చింది శేషగిరి రావుకు.

శేషగిరిరావు మద్రాసు చేరుకొన్నాడు. బావ రామం దగ్గరే ఉన్నాడు. రామానికి అంతకు మునుపే పెండ్లి అయింది. భార్య కాపురానికి వచ్చింది. పిల్లవాడు కూడా కలిగాడు. కాని జీతం సరిపోక ఇంకా కాపురం పెట్టుకోలేదు.

మద్రాసులో అవకాశాలు లేకపోలేదు. శేషగిరిరావు పట్టభద్రుడు కాని తక్కువవాడు కాదు. ప్రయత్నం ఫలిం

చింది. ఉద్యోగం దొరికింది. జీతం తగుమాత్రం. పాపం, రామానికి జీతం తక్కువ. అట్టే చదువుకొన్నవాడు కాదు.

ఉద్యోగం లభించిన తరువాత బావ రామంతో కలిసి ఉండడం శేషగిరిరావుకు ఇష్టం లేకపోయింది. రామం జీవిత పద్ధతి ఆయనకు నచ్చలేదు. రామానికి ఒక పద్ధతంటూ ఉన్నట్లు కనుపించలేదు. ఆతని బ్రతుకుకు తాడూ, బొంగరం లేదు. ఏ రోజు సంగతి ఆ రోజు. రేపటి ఆలోచన సుతరామూ లేదు. భార్యాబిడ్డలు ఏమౌతారో నన్న బాధ అంతకన్నా లేదు. ఇది శేషగిరిరావుకు సరిపడలేదు.

దానికి తోడు రోజూ కొత్త ఉపద్రవాలు తెచ్చిపెట్టే వాడు బావ రామం. శేషగిరిరావుకు ఉద్యోగం దొరికిన కొత్తలో కర్నూలునుంచి ఎవడో వూడిపడ్డాడు. బావ రామం స్నేహితుడు. భార్యాసహితంగా వచ్చాడు. భార్యకు వైద్యం చేయించడానికి మద్రాసు తీసుకొనివచ్చాడు. ఇంకేం? చికిత్స జరిగేవరకూ రామం ఇంట్లోనే మకాం.

ఈ పరిస్థితి చూడగానే శేషగిరిరావు వేరుగా ఉండ డానికి నిశ్చయించుకొన్నాడు. భార్యను తీసుకొనివచ్చి కాపురం పెట్టుకోవడానికి ఏర్పాటు చేసుకొన్నాడు. చేతులు కాలిన పిదప ఆకులు పట్టుకొనడం నిరర్థకం కదా!

శేషగిరిరావుకు చిన్న వాటా దొరికింది. బావ రామంతో చెప్పాడు—"బెజవాడ వెళ్ళి మీ చెల్లెల్ని తీసు కొని వస్తానోయ్" అని.

బెజవాడ లలితమ్మ తల్లిగారి వూరు. భర్తకు ఉద్యోగం దొరికి తీసుకొని వెళ్ళేవరకూ ఆ ఆడబిడ్డ తల్లిగారి ఇంట్లో ఉంటుంది. అదీ ఏర్పాటు.

బావ రామం బాగన్నాడు. తిరిగి వచ్చేటప్పుడు బెజవాడలో ఉన్న తన సామాను తెచ్చిపెట్టమని శేషగిరి రావుకు పురమాయించాడు బావ రామం.

బావ రామంతో సంబంధం తెంచుకోవాలని శేషగిరి రావు తీర్మానించుకొనడానికి అదే కారణం అయింది. రామానికి దిక్కు లేదు. అయినవాళ్ళను, కానివాళ్ళను నెత్తి మీద పెట్టుకొని అప్పుల పాలవుతున్నాడు. బాధలు తెచ్చి పెట్టుకొంటున్నాడు. ఇతరులను కూడా బాధిస్తున్నాడు.

లేకపోతే సామాను పట్టుకు రమ్మని పురమాయించిన మనిషి "ఛార్జీలకు ఈ రూపాయి ఉంచు, ఈ పావలా ఉంచు" అని ఏమైనా ఇచ్చాడా? ఇస్తే ఇంకేమి? రామానికి డబ్బు విషయంలో భేదం లేదు. తరువాత ఇస్తానని అయినా అనలేదు.

శేషగిరిరావు భార్యను తెచ్చుకొని వేరే కాపురం పెట్టుకొన్నాడు. కారణాంతరాలచేత శేషగిరిరావు అప్పట్లో బెజవాడనుంచి రామం సామాను తెచ్చిపెట్టలేకపోయాడు.

*　　　*　　　*

తరువాత చాలా సంవత్సరాలకు గాని శేషగిరిరావుకు తిరిగి రామంతో అనుబంధం ఏర్పడలేదు. మద్రాసు మహా నగరం మహా మంచిది. ఒక్క నగరంలో ఉన్నా మనిషికి

మనిషికి సంబంధం ఉండదు. సంబంధం పెట్టుకోనడం కూడా కష్టం.

కావాలని ఒకరితో సంబంధం పెట్టుకోవాలన్నా ఒక ప్రాంతానికీ మరొక ప్రాంతానికీ దిక్కు లేనంత దూరం కావడంచేత ఒక పట్టాన సాధ్యం కాదు. ఎవరిని అయినా కలుసుకోవాలంటే ఒక్కొక్కప్పుడు రోజంతా పోతుంది. పొట్టపోసుకోడానికి నౌకరీలు చేసుకొనే మనుషులకు రోజులు తక్కువ. సంసారంలో ఉండేవారికి మరీ నావకాశం తక్కువ. ఇది ఎంత గొప్ప సంగతి.

బావ రామం వంటి వాళ్లు అదే పట్నంలో ఉన్నప్పుడు ఇలాంటి సౌకర్యమే కనుక లేకపోతే జీవితం దుర్భరం అవుతుంది. ఎప్పుడూ ఉపద్రవాల్లో మునిగే ఆ మనుషులు ఇతరులకు ఉపద్రవాలు తెచ్చిపెట్టుతారు.

అన్ని సంవత్సరాలూ శేషగిరిరావు జీవితం ఒడుదుడుకులు లేకుండా గడిచిపోయింది.

అలాంటిది ఆ ప్రశాంతత భగ్నంచేయడానికి ఒకనాడు శేషగిరిరావు ఇంటికి చక్కా వచ్చాడు బావ రామం.

శేషగిరిరావు భయంతో కంపించాడు. శేషగిరిరావు అప్పుడప్పుడే కొంచెం నిలువలో పడ్డాడు. బావ రామానికి డబ్బుతో సంబంధం జాస్తి. అవసరం జాస్తి. డబ్బు ఆతని జీవితం చుట్టూ పరిభ్రమిస్తూ చిక్కకుండా తప్పించుకోడానికి

శాయశక్తులా ప్రయత్నంచేస్తూ ఉంటుంది. ఆ ప్రయత్నం విఫలమయ్యే సందర్భాలు లేకపోలేదు. కాని ఫలితం స్వల్పం.

ఇదంతా తెలిసిన శేషగిరిరావు భయపడ్డాడంటే ఆశ్చర్యం లేదు. ఇన్నాళ్ళూ కష్టపడి సంపాదించి ఎలాగో మిగిల్చి కూడబెట్టినదంతా బావ రామం ఇట్టే పట్టుక పోదామని వచ్చాడా?

"బావా, నీకు ఇబ్బంది లేకుండా ఉంటే కొన్నాళ్ళు నీ ఇంట్లో ఉంటానోయ్. ఇంకా ఇల్లు దొరక లేదు. దొరకగానే వెళ్ళిపోతాను" అన్నాడు బావ రామం.

శేషగిరిరావుకు ముచ్చెమటలూ పోశాయి. దూరంగా ఉన్నా రామం అంటే భయమే. ఎప్పుడు ఏమివస్తుందోనని అనుమానం. డబ్బు అడిగినా ఫరవాలేదు. లేదని చెప్పవచ్చు. కాదు కూడదంటే ఇంటికి తిరిగి వెళ్ళడానికి దారి ఖర్చులు ఇచ్చి పంపవచ్చు. కొంత త్యాగానికి సిద్ధపడక తప్పదు. కాని కుంపటి ఇంట్లోకి చక్కా వచ్చి ఎదురురొమ్ముమీద ఎక్కి కూర్చుంటానంటే భయపడక తప్పదు.

అంత్యనిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరం మేలు. "బావా, ఇల్లు బొత్తుగా ఇరుకు. నీకు తెలియందేముంది? ఇప్పటికే మీ చెల్లెలు నానా యాతనా పడుతోంది. ఏమీ అనుకోకు. వీలు లేదు. ఎక్కడ అయినా మరో వాటా దొరుకుతుందేమోనని చూస్తున్నాను. ఏమైనా దొరికితే చూద్దాం" అన్నాడు శేషగిరి రావు.

ముందు ఎప్పుడయినా మంచి ఇల్లు దొరికితే చూద్దామని శేషగిరిరావు అనడానికి కారణం ఉంది. ఇంట్లో ఉంటానని బావ రామం చెల్లెలితో అనలేదు. శేషగిరిరావుతో అన్నాడు. భార్య ద్వారా ఒత్తిడి రానందుకు ఆ నిమిషంలో సంతోషం కలిగి శేషగిరిరావు ఆ మాట అన్నాడు. అప్పటికి బావ రామం వెళ్ళిపోయాడు.

శేషగిరిరావు దగ్గర దాపరికం లేదు. భార్యతో ఈ సంగతి చెప్పాడు. ఆమెకు అన్నగారిమీద ప్రేమ ఉంది. కాని వివేకం లేదు. వెనకా ముందూ ఆలోచించదు.

"ఇంట్లో ఉండనివ్వండి. నేను ఇంకా బ్రతికిఉన్నానని ఇక్కడికి వచ్చాడు. ఈ మాత్రానికి కూడా నేను నోచుకోలేదు" అంటూ బావురుమంది.

స్త్రీల స్వభావమే అంత. అప్రస్తుతమైన విషయాలు ముడి పెట్టుతారు. కన్నీళ్ళకు కొదువలేదు. శేషగిరిరావుకు ఇదంతా సరిపడదు. ఇంట్లో వాదులాడుకోవడమంటే కిట్టదు. తప్పదనుకొన్నాడు. ఒక్క గీత మాత్రం గీశాడు.

"సరే ఉండమను. నాకు కొత్త ఇబ్బందులు మాత్రం తెచ్చిపెట్టకుండా చూడు" అన్నాడు శేషగిరిరావు.

లలితమ్మ మళ్ళీ ఏడిచింది.

బావ రామానికి ఆ మధ్య ఎప్పుడో ఉద్యోగం పోయింది. భార్యాబిడ్డల్ని బెజవాడ పంపాడు. ఒక్కడే ఎక్కడో ఒక స్నేహితునివద్ద ఉన్నాడు. ఆ స్నేహితుడికి బదిలీఅయి మద్రాసునుంచి వెళ్ళిపోయాడు.

రామానికి ఈలోగా మళ్ళీ ఉద్యోగం దొరికింది. అది చేసుకుంటూ తిరిగి కాపురం పెట్టుకోవాలని ఉద్దేశం. దగ్గర డబ్బులేక శేషగిరిరావు ఇంట్లో కొన్నాళ్ళు ఉందామనుకొన్నాడు. ఇదంతా తరువాత తెలుసుకొన్నాడు శేషగిరిరావు. ఆతని మనసుకు వూరట లభించలేదు.

బావ రామం మూలంగా శేషగిరిరావుకు కొత్త ఇబ్బందులు ఏమీ రాలేదు. చెల్లెలి ఇల్లే అయినా, ఉన్నన్నాళ్ళూ ఇంట్లో తిండి కూడా తినలేదు. అన్నట్లుగా కొన్నాళ్ళకే ఎక్కడో ఒక వాటా సంపాదించుకొని వెళ్లిపోయాడు.

బావ రామం, ఆయన ధర్మమా అని, కొత్త ఉపద్రవాలు ఏమీ తెచ్చిపెట్టకుండా తరువాత కొలది రోజులకే మద్రాసు నగరమే విడిచి వెళ్లిపోయాడు.

కర్నూలులో ఎవరో బస్సు కంపెనీ యజమాని—స్నేహితుడుట—ఉద్యోగం ఇచ్చాడు. జీతం కూడా కొంచెం ఎక్కువ.

శేషగిరిరావుకు కొంత వూరట లభించింది.

* * *

బావ రామం మళ్ళీ మద్రాసు రాలేదు. శేషగిరిరావుకు తిరిగి అతనితో అనుబంధం ఏర్పడలేదు.

కాలం మారింది. పరిస్థితులు కూడా మారాయి.

శేషగిరిరావు భార్యా పిల్లలు ఏడాదికోసారి కర్నూలు వెళ్ళివస్తూ వుంటారు. అంతకుమించి ఆ సంగతి శేషగిరిరావు

పట్టించుకో లేదు. పట్టించుకొంటే మీద ఏమి పడుతుందో అని భయం.

* * *

ఎన్నో సంవత్సరాలకు, మొన్న, బావ రామం కష్టాలు నుంచి వూడి పడ్డాడు. ఇంట్లో ఉంటూ నన లేదు.

కూడా ఎవరినో వెంటబెట్టుకొని వచ్చాడు. ఏదో సత్రంలో—రామస్వామి సత్రం కాబోలు—బస చేశాడు.

వెంటబెట్టుకొని వచ్చినవానికి ఉద్యోగం కావాలట. పేదవాడట. మంచివాడట. ప్రయోజకుడట. వెనుకా ముందూ ఎవరూ లేరట. బావ రామానికి బాగా తెలుసునట. మద్రాసులో బావ రామానికి తెలిసినవారు ఎవరో ఉంటే వారి ద్వారా ఉద్యోగం సంపాదించి పెట్టడానికి ఆ కుర్రవానిని వెంటబెట్టుకొని వచ్చాడు.

చెప్పనక్కర లేదు. ఆ కుర్రవాని ఖర్చుకూడా బావ రామం పెట్టవలసినదే.

తనకు దారి లేకపోయినా బావ రామం ఇతరుల బాధ్యత నెత్తిన వేసుకొనడానికి సందేహించడు. వయసు మళ్లుతూ ఉన్నా ఎప్పటి ఆటే! ఈసారి శేషగిరిరావుకు కోపం వచ్చింది.

* * *

శేషగిరిరావు ఆలోచన చివరికి వచ్చేసింది.

క్రిందటి రోజు సాయంకాలం వేళ శేషగిరిరావు ఇంక దుకాణం కట్టేసి—అదే ఆయన కంపెనీ—ఇంటికి పోదామనుకుంటున్న సమయంలో బావ రామం హడావిడిగా వచ్చాడు.

"నా కో ఉపకారం చేయాలి బావా" అన్నాడు.

ఈ ఎత్తుబడికి వ్యాఖ్యానం అనవసరం. ఉపకారం అంటే ఈ లోకంలో ఒక్కటే. డబ్బు.

"నాతో వచ్చిన కుర్రవాడికి ఉద్యోగం దొరికింది. ఇక్కడ ఉండిపోతాడు. రామస్వామి సత్రంలో ఓ నెలరోజుల పాటు ఎలాగో తలదాచుకోడానికి మానేజరుతో చెప్పి ఏర్పాటుచేశాను. మానేజరు నాకు తెలుసు. (అంతటి అనుభవం ఉన్న మనిషికి ఒక సత్రం మానేజరు ఏమిటి? అన్ని సత్రాల మానేజర్లూ తెలిసి ఉంటారనుకొన్నాడు శేషగిరిరావు) ఇంక అతణ్ణి గురించి చింత లేదు.

"పట్టుకొచ్చిన డబ్బు కాస్తా చాలా భాగం ఖర్చు అయింది.

"మిగిలినదాన్ని బస్సులో ఎవరో కాజేశారు. (శేషగిరిరావు ఆ మాటలు వింటూ నవ్వుకొన్నాడు—తనలో) నేను అర్జెంటుగా కర్నూలు తిరిగి వెళ్ళాలి. ఈవేళ రాత్రే పోవాలి. పదిహేను రూపాయలు ఇయ్యి బావా, నీ మేలు మరిచిపోను" అన్నాడు బావ రామం.

వ్యాపార ధర్మంలో అయితే అప్పులు ఇచ్చి పుచ్చుకొనడం లాయకీ. చేబదుళ్ళు అనేవి వేరే తరగతికి చెందుతాయి. డబ్బు లేని వారికి అవే ఆధారం. ఉన్నవారు వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

"ఇదివరకు ఎప్పుడూ నిన్ను అడగలేదు బావా, అంతటి అవసరం వచ్చింది కనుకనే అడుగుతున్నాను" అన్నాడు బావ రామం.

ఇదివరకు అడగనందుకు శేషగిరిరావు నిజంగా కృతజ్ఞుడు. ఇదివరకు అడగకుండా ఉంటే ఇప్పుడు అడగడానికి హక్కు వస్తుందా?

అవసరానికి ఏమిటి? ఏదో ఒక అవసరం ఎప్పుడూ వస్తూనే వుంటుంది.

"దుకాణంలో డబ్బు ముట్టుకోడానికి వీల్లేదు బావా. నా దగ్గరా డబ్బు లేదు" అన్నాడు శేషగిరిరావు. లేదనడం ఎవరికి అయినా కష్టమే.

"ఇంట్లో ఖర్చుకు ఉంచిన డబ్బు కూడా దుకాణంలో పెట్టవలసి వచ్చింది. అదీ కారణం" అంటూ అవసరం లేకపోయినా పరిస్థితి వివరించాడు శేషగిరిరావు.

అప్పుడు నిజమైన కారణం చెప్పాడు బావ రామం.

"పిల్లవాడికి చాలా జబ్బుగా ఉంది. వెంటనే బయలుదేరి రమ్మని కర్నూలు నుంచి టెలిగ్రాం వచ్చింది. ఈ రాత్రి ఏమైనా వెళ్ళక తప్పదు బావా. ఎలాగో చూచి ఇస్తే రక్షించినవాడివి అవుతావు" అన్నాడు బావ రామం.

నిజం కావచ్చు. నిజం కాదనడానికి వీలులేదు. అవసరమూ లేదు. శేషగిరిరావు సాహసించి ఒక నిశ్చయానికి వచ్చాడు.

"నా దగ్గర అయిదు రూపాయలు ఉన్నాయి. అంత అవసరమైతే తీసుకెళ్ళు. తరువాత చూచుకుందాం" అని జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి ఇచ్చాడు శేషగిరిరావు.

రామం నిలువు గుడ్లు వేసి నిద్రలో ఉన్నవాడి మాదిరి

రిగా ఆ నోటు తీసుకొని వెళ్లిపోయాడు. (ఇది నా వ్యాఖ్యానం— రచయిత.)

స్నేహితులమీద పడి ఇంతకాలం జీవించినవాడు రామం. మద్రాసులోనూ ఇంకా చాలామంది స్నేహితులు వుంటారు. ఈ నష్టం, స్నేహితుల్లో కొందరయినా పంచుకొంటే ఎవరికీ అంత బరువు వుండదు. శేషగిరిరావు ఒక్కడే ఎందుకు భరించాలి? అది అన్యాయం.

మరొకటి. నిజంగా పదిహేను రూపాయలు కావలసినవాడు దానికోసం కాళ్ళావేళ్ళా పడతాడు. అది శేషగిరిరావుకు తెలుసు. ఆయన దగ్గర ఉద్యోగులు ఉన్నారుగా? బావ రామం మరి అయిదు రూపాయల నోటు తీసుకొని వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

ఈ వేళ ఉదయం పత్రికలో ఈ వార్త.

బావ రామాన్ని శేషగిరిరావు కర్నూలునుంచి రమ్మన్నాడా? లేదు. బావ రామం కొడుక్కి జబ్బు చేయాలని కోరుకొన్నాడా? లేదు. ఇప్పుడు ఈ పిడుగు శేషగిరిరావుమీదే ఎందుకు పడాలి?

తప్పదు. ఇప్పుడు ఎలాగూ కొంత ఖర్చు కాక తప్పదు. ఎక్కువ కాకుండా చూడడం శేషగిరిరావు కనీస ధర్మం.

ఈ వార్త ఇంట్లో అందరికీ తెలిసినదే. శేషగిరిరావు ఇప్పుడు ఎవరికీ చెప్పనక్కరలేదు.

పెద్ద అబ్బాయి నరసింహారావును సంగతి సందర్భాలు తెలుసుకొని రావడానికి ఒకసారి ఆస్పత్రికి పంపడం మంచిది. తరువాత కర్తవ్యం నిర్ణయించుకోవచ్చును.

ఖర్చు అనుకోగానే మరొక సంగతి ఆలోచనలోకి వచ్చింది.

బావ రామం అడిగినప్పుడు పదిహేను రూపాయలు ఇస్తే బాగా ఉండేదేమో? ఆనాడు ఈ ప్రమాదం సంభవించక పోనేమో? అలా అనుకొని కూడా లాభం లేదు. ఆ పదిహేనూ పోయి, ఈ ప్రమాదమూ సంభవిస్తే నష్టం మరీ అధికంగా ఉండేది. ఇదే నయం. ఇప్పుడు అయిదు రూపాయల నష్టంతో సరిపోయింది. ఏమైతే నేం? నష్టం ఎటూ తప్ప లేదు.

శేషగిరిరావు దీర్ఘంగా నిట్టూర్పు విడిచి చిన్నవాడి వంక చూచాడు.

*    *    *

"అన్నయ్యను పిలు."

"లేదండి."

"ఏమయ్యాడు?"

"ఆస్పత్రికి వెళ్ళాడండి."

"నాతో చెప్ప లేదేమి?"

"మీరు నిద్రపోతున్నారు."

శేషగిరిరావు గుండె గతి తప్పింది. పెద్దవాడు సాహసించాడు. స్వతంత్రించాడు. దీనిని విడిచిపెట్టకూడదు. లేకపోతే గోరుతో తుంచేదాన్ని గొడ్డలితో తుంచవలసి వస్తుంది.

పెద్దవాడు స్వతంత్రిస్తే తల్లి ఏమి చేసింది? బుద్ధి చెప్ప వద్దూ?

"మీ అమ్మను పిలవరా" అన్నాడు శేషగిరిరావు.

"లేదండి."

శేషగిరిరావు చెవులను నమ్మలేకపోయాడు.

"ఏమిటి?"

"లేదండి."

"ఏమైంది?" పెద్దగా అరిచాడు శేషగిరిరావు.

"ఆస్పత్రికి వెళ్ళిందండి" వణికిపోతూ సమాధానం చెప్పాడు చిన్నవాడు.

కొంచెం నిగ్రహించుకొన్నాడు శేషగిరిరావు. దీని అంతం చూడాలి.

"ఎప్పుడు వెళ్ళింది?"

"పేపరు చూడగానే అన్నయ్య అమ్మతో చెప్పాడు..."

"చెప్పాడూ?"

"అమ్మ వెంటనే అన్నయ్యను తీసుకొని ఆస్పత్రికి వెళ్ళిందండి."

"నాతో చెప్పలేదేం?"

"మీరు నిద్రపోతున్నారండి."

"లేపలేదేం?"

"నిద్రాభంగం అయితే కోపం వస్తుంది; లేపద్దని అమ్మ చెప్పింది."

"ఎంత పని అయింది" అన్నాడు శేషగిరిరావు. కోపం పట్టలేకపోయాడు. అంత కోపంలో కూడా తన శాసనం ఉల్లంఘించడానికి భార్య సాహసించినందుకు గర్వించాడు.

"తిరిగి ఎప్పుడు వస్తానంది?"

"తెలియదండి."

"అసలు రాదా?" గద్దించాడు శేషగిరిరావు.

"మామయ్యకు ప్రమాదం లేదు, తీసుకొని వెళ్ళవచ్చునని ఆస్పత్రిలో చెప్పారట. మామయ్య వెంటనే కర్నూలు వెళ్ళిపోవాలన్నాడట. అందుచేత మామయ్యను తీసుకొని కర్నూలు వెళ్లుతున్నానని ఇప్పుడే ఫోన్‌లో చెప్పించిందండి."

"చాలా బాగుంది. ఎలా తీసుకు వెళ్లుతుంది? ఇప్పుడు రైలుబండి లేదుగా?"

"కారులోనండి."

"ఆస్పత్రికి ఫోన్ చేసి, వెంటనే నాతో మాట్లాడమని చెప్పు." స్వయంగా మాట్లాడి ఇదేదో ఇప్పుడే తేల్చుకొంటే మంచిది. ముసుగులో గుద్దులాట దేనికి?

"ఆస్పత్రిలో లేదండి. బయలుదేరుతూ ఫోన్ చేసింది అమ్మ. నాతో మాట్లాడగానే వెళ్ళిపోతున్నామని చెప్పింది."

"అన్నయ్య ఏమయ్యాడు?" భార్యకు లేకపోయినా ఇంత చేసినందుకు కొడుక్కు అయినా ఆమాత్రం భయం, భక్తి లేకుండా ఉంటుందా?

"అన్నయ్యే డ్రైవ్ చేస్తున్నాడండి."

శేషగిరిరావు ఇంక అణచుకోలేకపోయాడు.

"నువ్వు కూడా పోకపోయావు? నాకు పీడ విరగడ అవును" అనేశాడు.

"వెళ్ళుతున్నానండి."

"పో. ఇంకా వున్నావేం?" అని అరిచాడు శేషగిరిరావు.

"ఆ మాట చెప్పడానికే నిలబడి వున్నానండి" అంటూ చిన్నవాడు వెళ్ళిపోయాడు.

చిన్నవాడి ప్రవర్తనతో తలక్రిందు లయ్యాడు శేషగిరిరావు.

చిన్నవాడిమీది దృష్టి అప్రయత్నంగా మళ్ళీ ఆ వార్త మీద పడింది.

దానిలో ఉన్నది ఇది :

"గత రాత్రి సెంట్రల్ స్టేషన్‌లో మెయిలు బయలు దేరుతూ వుండగా ఒకాయన పరుగెత్తుకొనివచ్చి బండి ఎక్క-బోయి కాలు జారి క్రింద పడ్డాడు. ఇది చూచి ఎవరో గొలుసు లాగారు. వెంటనే బండి ఆగిపోయింది. అతనికి కొంచెంలో చావు తప్పింది. మోపైన గాయాలు తగిలాయి. వెంటనే జనరల్ ఆసుపత్రిలో చేర్చారు. వయసు నలభైయైదు సంవత్సరాలు ఉంటుంది. కన్నులు వాసి. పేరు......రామం. అతనివద్ద ప్లాట్‌ఫారం టికెట్టు వుంది."

శేషగిరిరావు అలాగే కూర్చుని ఆ అక్షరాల వంక శూన్యంగా చూస్తూ వుండిపోయాడు.

---